తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

సంపుటి: 02
సంచిక:67

24 క్యారెట్లు 144,457.00 | కిలో వెండి 2,00,000.00 | chourastha Digitals | 06.11.2026 శుక్రవారం, హైదరాబాద్

వ్యక్తిగత స్వేచ్ఛకు సుప్రీం రక్షణ..

- నిర్బంధ సమయం నుంచే |24 గంటల లెక్కింపు
- అరెస్ట్ సమయం కాదు.. నిర్బంధించిన క్షణం నుంచే 24 గంటల గడువు ప్రారంభం
- పోలీసుల అదుపులోకి తీసుకున్నప్పటి నుంచే లెక్కించాలి
- సుప్రీంకోర్టు కీలక తీర్పు



2లో



అధికారమే లక్ష్యంగా బీజేపీ కుట్రలు

- గోకుల్ డెయిరీ ఎన్నికల్లో ప్రజాతీర్పును తారుమారు చేసే యత్నం
- రైతుల తీర్పును గౌరవించాలి..
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయొద్దు
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

గోకుల్ డెయిరీ ఎన్నికల్లో పాడి రైతులు బీజేపీ కూటమిని ఓడించారని, కాంగ్రెస్ మద్దతు ఉన్న ప్యానెల్‌కు మెజారిటీ కట్టబెట్టారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బోర్డులో నలుగురు డైరెక్టర్లను అదనంగా నియమించి, 12 మందిని 16 మందిగా మార్చడం ద్వారా మెజారిటీని దొంగిలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇది పాల ఉత్పత్తిదారుల ఓట్లను అపహరించడమేనని, ప్రజాతీర్పును కల్తీ చేయడమేనని అధికారాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శించారు. మహారాష్ట్రలోని కొల్హాపుర్ గోకుల్ డెయిరీ సహకార సంఘం ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తారుమారు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత నిబంధనలను మార్చి, బోర్డులో మెజారిటీని దక్కించుకోవాలని చూస్తోందని గురువారం తన ఎక్స్ ఖాతాలో మండిపడ్డారు.

।మిగతా 2 లో।



ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా గ్లోబల్ సమ్మిట్

ఏర్పాట్లకు సీఎం రేవంత్ డెడ్‌లైన్!

- నవంబర్ 15లోగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి
- ప్రతినిధులకు ప్రత్యేక లైజనింగ్ అధికారులు.. భద్రతకు పెద్దపీట
- పర్యాటకం, విద్య, వాతావరణ మార్పులపై ప్రత్యేక చర్చలు
- వాతావరణ మార్పులు, విద్యారంగంపై ప్రత్యేక చర్చా వేదికలు
- దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా
- సమ్మిట్‌ను తీర్చిదిద్దే యోచన
- పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా సమన్వయంతో ముందుకు సాగాలి

తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేలా హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. నవంబర్ 15వ తేదీలోగా సమ్మిట్‌కు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని గడువు విధించారు. అంతర్జాతీయ ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో

గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ప్రత్యేకంగా ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని సీఎం సూచించారు. విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. సమ్మిట్‌కు ముందుగానే

।మిగతా 2 లో।

బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.200 వసూలు

- 'ఆర్ఆర్ ట్యాక్స్'పై కేటీఆర్ సంచలన ఆరోపణలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు.. బీజేపీ తీరుపైనా ప్రశ్నలు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



తెలంగాణలో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారం మరోసారి రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బిల్డర్లు, డెవలపర్ల నుంచి చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా ఈ వసూళ్ల వ్యవహారం గురించి చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. తెలంగాణలో 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో అవినీతి జరుగుతోందని ఆరోపించిన నేపథ్యంలో కేటీఆర్

।మిగతా 2 లో।

గ్లోబల్ సమ్మిట్‌తో భారీ పెట్టుబడులు ఖాయం!

తెలంగాణను ప్రపంచ పారిశ్రామిక రంగంలో కీలక కేంద్రంగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీపడేలా పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నామని, త్వరలో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తాయనే విశ్వాసం ఉందని పేర్కొన్నారు.


హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.దీపావళి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రులు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో

।మిగతా 2 లో।



- పెట్టుబడులపై మంత్రి పొంగులేటి ధీమా
- ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు..
- ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
- కొడంగల్‌లో నవంబర్ 9న భారీ రైతు సభ
- ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు..
- 136 కోర్టు పోస్టులకు కేబినెట్ ఆమోదం



అమెరికా కాంగ్రెస్‌లో మార్పులు..

- భారత్‌కు కొత్త సవాళ్లు!
- ఇండో-పసిఫిక్ విధానాల్లో భారత్‌కు మద్దతు పెరిగే అవకాశం
- మానవ హక్కులు, రష్యా చమురు కొనుగోళ్లపై డెమొక్రాట్ల ప్రశ్నలు?

2లో



మరసు తుపాను బీభత్సం

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ పంట నష్టం
- 15 వేల ఎకరాల్లో నీటమునిగిన పంటలు..
- పొట్టదశలో వరి నేలవాలు.. రాకపోకలకు తీవ్ర అంతరాయం
- కొట్టుకుపోయిన రింగ్‌బండ్.. జలదిగ్బంధంలో గ్రామాలు

2లో

నీటి గండం.. మారనున్న హైదరాబాద్ జీవనశైలి

- ఎల్‌నినో ప్రభావంతో విద్యా, ఐటీ రంగాలపై నీటి సంక్షోభం పంజా
- ఒంటిపూట బడులు.. ఆన్‌లైన్ క్లాసులు..
- సంక్రాంతి నుంచి ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్?

2లో



వ్యక్తిగత స్వేచ్ఛకు సుప్రీం రక్షణ..

న్యూఢిల్లీ, తెలంగాణ చౌరస్తా:

వ్యక్తిగత స్వేచ్ఛకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే దిశగా సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే 24 గంటల గడువు ప్రారంభమవుతుందని స్పష్టం చేసింది. అధికారికంగా అరెస్టు నమోదు చేసిన సమయం నుంచి మాత్రమే గడువును లెక్కించాలన్న పోలీసుల వాదన చెల్లదని తేల్చిచెప్పింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2) ప్రకారం అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాలి. అయితే అధికారిక అరెస్టుకు ముందు విచారణ, దర్యాప్తు, తనిఖీలు, వస్తువుల స్వాధీనం వంటి ప్రక్రియల పేరుతో వ్యక్తిని నిర్బంధించిన సమయాన్ని ఈ గడువు నుంచి మినహాయించడానికి వీలేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అరెస్టు జరిగిన ప్రదేశం నుంచి మేజిస్ట్రేట్ వద్దకు తీసుకెళ్లేందుకు పట్టే ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని పేర్కొంది.అధికారిక అరెస్టుకు ముందు నిర్బంధంలో గడిచిన సమయాన్ని 24 గంటల లెక్కింపు నుంచి మినహాయించవచ్చన్న ఒడిశా, మద్రాస్, కేరళ హైకోర్టుల గత అభిప్రాయాలను సుప్రీంకోర్టు అంగీకరించలేదు. అరెస్టు మెమోలో నమోదైన సమయాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకొని వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించరాదని స్పష్టం చేసింది. జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్. చంద్రుర్కర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ మేరకు తీర్పు వెలువరించింది.24 గంటల రాజ్యాంగ గడువులోగా నిందితులను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారా లేదా అన్న విషయాన్ని న్యాయాధికారులు స్వతంత్రంగా పరిశీలించాలని సుప్రీంకోర్టు సూచించింది. నిర్బంధ సమయం సహేతుకంగా ఉందా లేదా అన్నది కూడా అంచనా వేయాలని పేర్కొంది. గడువును ఉల్లంఘించినట్లు తేలితే రిమాండ్ మంజూరు చేయకుండా తిరస్కరించాలని, చట్టబద్ధమైన నిర్బంధానికి ఆధారం లేని పరిస్థితుల్లో సంబంధిత వ్యక్తిని విడుదల చేయాలని స్పష్టం చేసింది.



త్రిపుర హైకోర్టు బెయిల్ నిరాకరించడాన్ని సవాలు చేస్తూ నలుగురు వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదైన ఈ కేసులో 2025 సెప్టెంబర్ 29న మధ్యాహ్నం 2 గంటలకు అధికారులు వారిని నిర్బంధించారు. అయితే సెప్టెంబర్ 30న ఉదయం 11 గంటలకు మాత్రమే అధికారికంగా అరెస్టు చేసినట్లు నమోదు చేశారు. ఈ సమయాలను పరిశీలించిన సుప్రీంకోర్టు.. 24 గంటల గడువును సెప్టెంబర్ 29 మధ్యాహ్నం 2 గంటల నుంచే లెక్కించాలని స్పష్టం చేసింది. అంటే సెప్టెంబర్ 30 మధ్యాహ్నం 2 గంటల్లోగా వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచాల్సి ఉంటుందని పేర్కొంది. పోలీసుల నిర్బంధ అధికారాలకు రాజ్యాంగ పరిమితులను గుర్తుచేస్తూ, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు అత్యున్నత న్యాయస్థానం మరోసారి బలమైన రక్షణ కల్పించింది.

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా గ్లోబల్ సమ్మిట్

తరువాయి భాగం

ప్రతినిధులకు అవసరమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తెలంగాణ పర్యాటక వైభవానికి అంతర్జాతీయ ప్రచారం

తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలను ప్రపంచ దేశాల ప్రతినిధులకు పరిచయం చేసేలా ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.రాష్ట్ర పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చేలా సమ్మిట్‌ను వేదికగా ఉపయోగించుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ మార్పులపై ప్రత్యేక చర్చలు నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

విద్యా రంగ ప్రగతిపైనా చర్చలు

తెలంగాణ విద్యా వ్యవస్థలో నర్సరీ స్థాయి నుంచి ఆక్స్‌ఫర్డ్ స్థాయి వరకు విద్యా ప్రగతిని ప్రతిబింబించేలా సమ్మిట్‌లో ప్రత్యేక చర్చలు ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. విద్యా రంగంలో వస్తున్న మార్పులు, నూతన ఆవిష్కరణలు, అంతర్జాతీయ ప్రమాణాలపై చర్చలకు అవకాశం కల్పించాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌కు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు.

దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహణ

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో మూడు రోజుల పాటు జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు ఈ సమ్మిట్ కీలక వేదికగా నిలిచేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులతో దీపావళి వేడుకలు

మరోవైపు దీపావళి సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో తాను కూడా భాగస్వామిని అవుతానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో పండుగ వేడుకల్లో పాల్గొనాలని ఆదేశించారు.

మురసు తుపాను బీభత్సం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :n

మురసు తుపాను ఉమ్మడి ఖమ్మం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది.బుధవారం కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 15 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. పంట చేతికొచ్చే సమయంలో తుపాను రూపంలో ప్రకృతి విరుచుకుపడటంతో అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల్లో భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అశ్వారావుపేటలో అత్యధికంగా 25.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దమ్మపేట మండలం మల్కారంలో 18.7, అంకంపాలెంలో 14.8, ములకలపల్లిలో 14.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా సగటున 9.25 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు నీటమునగడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. బలమైన ఈదురుగాలులకు పొట్టదశలో ఉన్న వరి పైరు నేలవాలింది. కూలీల కొరతతో పత్తి తీయలేకపోయిన రైతులకు వర్షాలు మరింత నష్టాన్ని మిగిల్చాయి. అశ్వారావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్ కొట్టుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లోని వందలాది ఎకరాలు నీటమునిగాయి. పట్టణంలోని దొంతికుంటకు భారీగా వరద చేరడంతో నివాస ప్రాంతాలు నీటమునిగాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అధికారులు చెరువుకు గండికొట్టారు. మందలపల్లి, గున్నెపల్లి గ్రామాల వద్ద ఖమ్మందేవరపల్లి జాతీయ రహదారిపైకి వరద నీరు చేరింది. అశ్వారావుపేట, ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో సుమారు 1,600 ఎకరాల్లో మినుము, 1,500 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. పలుచోట్ల ధాన్యం కుప్పలు వర్షపు నీటికి తడిసి ముద్దయ్యాయి.ములకలపల్లి మండలంలో పాములేరు వాగుపై నిర్మించిన తాత్కాలిక రహదారి వరద ఉద్ధృతికి కొట్టుకుపోయింది. తాళ్లపాయి గ్రామంలోకి వరద నీరు చేరడంతో 25 కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. దమ్మపేట మండలం దురదపాడుకు చెందిన నాగమణి మల్లెపూలవాగు వరదలో చిక్కుకుని చెట్టుపైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకుంది. విషయం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వెళ్లడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. రెస్క్యూ సిబ్బంది ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. మరోవైపు ములకలపల్లి మండలంలోని మూకుమామిడి ప్రాజెక్టు వరదలో చిక్కుకున్న మధు అనే యువకుడిని సహాయక బృందాలు రక్షించాయి.

వాగులు పొంగి.. నిలిచిపోయిన రాకపోకలు

ఖమ్మం జిల్లాలోని వేంసూరు, సత్తుపల్లి, వైరా, కల్లూరు మండలాల్లో వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఖమ్మంకొత్తగూడెం ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జన్నారం వద్ద వాగు ప్రవాహం కారణంగా రాకపోకలను నిలిపివేశారు. తల్లాడ మండలం రామచంద్రాపురం వద్ద ఏరు ఉద్ధృతంగా ప్రవహించడంతో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వైరా నియోజకవర్గంలో వందలాది ఎకరాల్లో వరి, మిర్చి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. వైరా జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది.

సింగరేణి గనుల్లోనూ నిలిచిన పనులు

భారీ వర్షాల ప్రభావంతో మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి ప్రాంతాల్లోని సింగరేణి ఉపరితల గనుల్లో బొగ్గు వెలికితీతకు ఆటంకం ఏర్పడింది. గనుల్లోకి చేరిన వరద నీటిని ఎప్పటికప్పుడు తోడేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పరిహారం అందించి ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి

ఈ ఏడాది ఎల్‌నినో పరిస్థితుల కారణంగా వర్షాల కోసం ఎదురుచూసిన రైతులకు మురసు తుపాను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పంట చేతికొచ్చే సమయంలో ఏకధాటిగా కురిసిన వర్షాలకు చేలల్లో మూడు అడుగుల మేర నీరు నిలిచిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలు దెబ్బతినడంతో పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని వాపోతున్నారు. ప్రభుత్వం తక్షణమే పంట నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని కోరుతున్నారు.

బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు
రూ.200 వసూలు

తరువాయి భాగం

స్పందించారు.ప్రధాని మోదీ, అమిత్ షా తరచూ తెలంగాణకు వచ్చి సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. అయితే ఈ వ్యవహారంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

'బడా భాయ్ మోదీ, హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు వచ్చి రేవంత్, రాహుల్‌పై ఆరోపణలు చేస్తుంటారు. కానీ ఈ ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో ఎలాంటి చర్యలు ఉండవు. బడా భాయ్ తన ఛోటా భాయ్‌పై ఎప్పటికీ చర్యలు తీసుకోరు' అంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో మరోవైపు, హైదరాబాద్‌లో నిర్వహించిన 'లోకతంత్ర బచావో.. అరాచకత హటావో' మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న



వసూళ్లను 'ఆర్ఆర్ ట్యాక్స్'గా అభివర్ణించారు. ఈ పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు దిల్లీలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి చేరుతున్నాయని, అందుకే దానిని 'రాహుల్‌రేవంత్ ట్యాక్స్' అని పేర్కొన్నారుకాంగ్రెస్, బీజేపీ నేతల పరస్పర ఆరోపణలు, వాటిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది.



గ్లోబల్ సమ్మిట్‌తో భారీ పెట్టుబడులు ఖాయం!

తరువాయి భాగం

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 2.25 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, నిర్మాణం పూర్తయిన అన్ని ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పొంగులేటి తెలిపారు. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని కూడా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నవంబర్ 20 నుంచి 30 వరకు గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి కుటుంబాల నుంచి దరఖాస్తులు సేకరిస్తాయని, వాటిని తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు స్వీకరిస్తారని వివరించారు.

కొడంగల్‌లో నవంబర్ 9న భారీ రైతు సభ

నవంబర్ 7 నుంచి 9 వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని మంత్రులు తెలిపారు. నవంబర్ 9న అక్కడ భారీ రైతు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సభలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని పేర్కొన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, రెండు వర్గాలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్2003ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. ఒక్కో కమిషన్‌లో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారని, ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రి పొంగులేటి వివరించారు.తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్1999 సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలకు గల కారణాలను గుర్తించడం, అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించడం వంటి అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను చట్టంలో పొందుపరచనున్నారు.రాష్ట్రంలోని పలు న్యాయస్థానాలకు మొత్తం 136 పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో కొత్తగా ఏర్పాటైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి కోర్టుకు 56 పోస్టులు మంజూరు చేసింది. అలాగే సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని నాలుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు మరో 80 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది.తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీలు చేసుకునే గడువును ప్రస్తుతం ఉన్న 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు మంత్రులు వెల్లడించారు.

అధికారమే లక్ష్యంగా బీజేపీ కుట్రలు

తరువాయి భాగం

విమర్శించారు. రైతుల ఓట్లను దొంగిలించే వారిని అన్నదాతలు ఎప్పటికీ మరిచిపోరని హెచ్చరించారు.అక్టోబర్ 19న జరిగిన కొల్హాపుర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం (గోకుల్ డెయిరీ) ఎన్నికల్లో మొత్తం 25 స్థానాలకు పోటీ జరిగింది. కాంగ్రెస్ నేత సతేజ్ పాటిల్ నేతృత్వంలోని ప్యానెల్ 13 స్థానాల్లో విజయం సాధించి స్పష్టమైన మెజారిటీ దక్కించుకుంది. అధికార మహాయుతి కూటమి మద్దతు ఉన్న ప్యానెల్ 12 స్థానాలకే పరిమితమైంది. అయితే బోర్డు సమావేశాలకు అవసరమైన 14 మంది డైరెక్టర్ల కోరం లేకపోవడంతో చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. మహాయుతి మద్దతు ఉన్న డైరెక్టర్లు సమావేశాలకు గైర్హాజరై ఎన్నిక ప్రక్రియకు అడ్డంకులు సృష్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో నవంబర్ 10న తిరిగి ఎన్నిక నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించినట్లు పవన్ ఖేడా వెల్లడించారు.ఎన్నికైన బోర్డు సజావుగా పనిచేయకుండా మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేడా ఆరోపించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ.500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన సహకార సంస్థల మేనేజింగ్ కమిటీల్లో ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యులను నియమించాలని నిర్ణయించిందని తెలిపారు. వీరిలో నలుగురికి ఓటు హక్కు కల్పించడం ద్వారా ఎన్నికైన సభ్యుల బలాబలాలను మార్చే అవకాశం ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి, సహకార సంస్థల స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్‌తో పాటు ఓటరు గుర్తింపు కార్డు (EPIC) నంబర్‌ను తప్పనిసరి చేయాలన్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వ్యాఖ్యలపైనా కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఓట్ల చోరీ అనేది కేవలం ట్రైలర్ మాత్రమే నని, అసలు కథ హక్కుల చోరీ అని విమర్శించింది. సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ స్థానంలో ఓటరు గుర్తింపు కార్డును ఉపయోగించాలన్నది కేంద్ర ప్రభుత్వ అధికారిక విధానమేనా అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా నిబంధనల మార్పుతో అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. గోకుల్ డెయిరీ వివాదం మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి తెరలేపింది.



నీటి గండం.. మారనున్న హైదరాబాద్ జీవనశైలి

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు తెలంగాణను నీటి సంక్షోభం దిశగా నెడుతున్నాయి. భూగర్భ జలమట్టాలు వేగంగా పడిపోతుండటంతో హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చుతోంది. ఇప్పటికే నీటి కొరత ప్రభావం విద్యాసంస్థలను తాకగా, త్వరలో ఐటీ రంగంపైనా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. డిసెంబరు నాటికి పరిస్థితి మరింత దిగజారవచ్చన్న అంచనాలతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.హైదరాబాద్‌లోని మాదాపూర్, గచ్చిబౌలి, కొండాపూర్, హైటెక్ సిటీ, కూకట్‌పల్లి ప్రాంతాల్లోని పలు కార్పొరేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు నీటి కొరతతో సతమతమవుతున్నాయి. హాస్టళ్లలో విద్యార్థులకు సరిపడా నీరు అందుబాటులో లేకపోవడంతో కొన్ని విద్యాసంస్థలు తాత్కాలిక సెలవులు ప్రకటించాయి. విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లాలని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పాటు సెలవుల సమయంలో ఆన్‌లైన్ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించాయి. నగరంలో సుమారు 33 విద్యాసంస్థలు తీవ్ర నీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.నీటి కొరతతో పాటు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉండటంతో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఒంటిపూట బడులు నిర్వహించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నీటి ఎద్దడి, అధిక ఉష్ణోగ్రతలు ఉన్న జిల్లాల్లో పాఠశాలల పనివేళల్లో మార్పులు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. జూనియర్ కళాశాలల సమయాలను మార్చడంతో పాటు డిగ్రీ, ఇతర ఉన్నత విద్యా కోర్సులకు ఆన్‌లైన్ బోధన చేపట్టే అవకాశాలనూ పరిశీలిస్తున్నారు.

ఐటీ కారిడార్‌లోనూ నీటి కష్టాలు

హైదరాబాద్ ఐటీ హబ్‌గా పేరొందిన గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, హైటెక్ సిటీ ప్రాంతాల్లోనూ నీటి కొరత తీవ్రంగా కనిపిస్తోంది. అనేక ఐటీ సంస్థలు ట్యాంకర్ల నీటిపై ఆధారపడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో సుమారు ఐదు లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండటంతో నీటి అవసరాలు తీర్చడం సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేందుకు వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని మళ్లీ అమలు చేయాలన్న ప్రతిపాదనలు తెరపైకి వస్తున్నాయి.

సంక్రాంతి నుంచి ఇంటి నుంచే విధులు?

కోవిడ్ సమయంలో అమలైన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని మరోసారి తీసుకొచ్చే అంశంపై ఐటీ సంస్థలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు తమ స్వస్థలాల నుంచి విధులు నిర్వహిస్తే హైదరాబాద్‌పై నీటి ఒత్తిడి తగ్గుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. సుమారు 20 లక్షల మంది నగరాన్ని వీడే అవకాశం ఉందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ కంపెనీలకు ప్రభుత్వం సూచనలు చేసే అవకాశం ఉందని, సంక్రాంతి నుంచి వర్క్ ఫ్రమ్ హోమ్ అమలుపై నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది.

నీటి సంక్షోభంపై ముందస్తు చర్యలు అవసరం

ఎల్‌నినో ప్రభావం కొనసాగితే రానున్న రోజుల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఇప్పటికే విద్యాసంస్థలు, ఐటీ సంస్థలను ప్రభావితం చేస్తున్న నీటి కొరత సాధారణ ప్రజల జీవితాలపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా, ఉద్యోగుల విధులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అయితే ఒంటిపూట బడులు, ఆన్‌లైన్ తరగతులు, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలపై ఇప్పటివరకు తుది అధికారిక నిర్ణయం వెలువడలేదు.



అమెరికా కాంగ్రెస్‌లో మార్పులు..

తెలంగాణ చౌరస్తా, వెబ్ డెస్క్ :

అమెరికా కాంగ్రెస్‌లో రాజకీయ ఆధిపత్యం మారితే భారత్‌అమెరికా సంబంధాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్న చర్చ మొదలైంది. దక్షిణాసియా లేదా ఇండోపసిఫిక్ సబ్ కమిటీకి భారత అనుకూల వైఖరి కలిగిన నేత చైర్మన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఉందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. అదే జరిగితే కీలక సాంకేతిక పరిజ్ఞానం, ఉమ్మడి రక్షణ ఉత్పత్తులు, క్వాడ్ కూటమి వంటి అంశాలకు అమెరికా కాంగ్రెస్ నుంచి మరింత బలమైన మద్దతు లభించే అవకాశముంది.

భారత్‌కు వ్యూహాత్మకంగా ప్రయోజనం

ఇండోపసిఫిక్‌ప్రాంతంలోచైనాప్రభావాన్నిసమతుల్యం చేయడం, ప్రాంతీయ భద్రతను బలోపేతం చేయడం వంటి అంశాల్లో భారత్‌అమెరికాకు కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ఈనేపథ్యంలో అమెరికా కాంగ్రెస్‌లోభారత్‌కుఅనుకూలమైననేతలకుకీలకబాధ్యతలు దక్కితేరక్షణ,సాంకేతికరంగాల్లోద్వైపాక్షికసహకారం మరింతవిస్తరించవచ్చనిఅంచనా.

మానవ హక్కుల అంశాలపై విమర్శలు?

మరోవైపు, డెమొక్రాట్ పార్టీకి చెందిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు భారత్‌లో మానవ హక్కులు, మైనారిటీల మత స్వేచ్ఛకు సంబంధించిన అంశాలను మరోసారి చర్చకు తీసుకువచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తున్న అంశంపైనా డెమొక్రాట్లు ప్రశ్నలు లేవనెత్తే అవకాశముంది. దీంతో భారత విదేశాంగ శాఖకు దౌత్య పరమైన సవాళ్లు ఎదురుకావచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ ప్రయోజనాలే ప్రాధాన్యం

అమెరికాలో అధికార మార్పులు, కాంగ్రెస్‌లో రాజకీయ ఆధిపత్యం మారినప్పటికీ భారత్‌అమెరికా వ్యూహాత్మక భ

ప్రభుత్వ పాఠశాలలో పేరెంట్ టీచర్ మీటింగ్

- విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పని చేయాలని పిలుపు
- గ్రామ సర్పంచ్ బంగారు రమేష్

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలో గురువారం పేరెంట్ -టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.మధ్యాహ్న భోజన సమయం వరకు ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బంగారు రమేష్ మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సాయశక్తులా కృషి చేస్తోందన్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు యూనిఫాంలు,పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్,షూస్,టైలు,బెల్టులు వంటి అవసరమైన సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రాథమిక విద్యాభివృద్ధికి గత మూడు సంవత్సరాలుగా విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు.ఆయన కృషి ఫలితంగా ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలోనూ పెద్దపల్లి జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కలెక్టర్ కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.గ్రామంలోని తల్లిదండ్రులందరూ తమ పిల్లలతో పాటు చుట్టుపక్కల ఉన్న ఇతర పిల్లలను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని,తద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బంగారు రమేష్,ఉపసర్పంచ్ గోలి సుధాకర్,ఏపీసీ చైర్మన్ ఓరుగంటి శ్రీజ,ప్రధానోపాధ్యాయురాలు స్వప్న,ఉపాధ్యాయురాలు మాధవి,శైలజ,భారతి,విద్యార్థులు,తల్లిదండ్రులు,తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో మాజీ సర్పంచ్ రావుల నారాయణ మృతి

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా :



పాలకుర్తి మండలం మాజీ సర్పంచ్ రావుల నారాయణ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. 2006 నుంచి 2011 వరకు గ్రామ పంచాయతీల పునర్విభజనకు ముందు ఉమ్మడి పాలకుర్తి, బసంత్‌నగర్ గ్రామాలకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. తన పదవీకాలంలో గ్రామాల అభివృద్ధికి విశేష కృషి చేశారు.గతంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ఆయన మృతి పట్ల రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మరియు పాలకుర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు పర్షవేణి శ్రీనివాస్, పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ సర్పంచ్ పెద్దపల్లి తిరుమల, తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.రావుల నారాయణ మృతి పట్ల పాలకుర్తి, బసంత్‌నగర్ గ్రామాల ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



బాలింతలకు పౌష్టికాహార పంపిణీ

- పౌష్టికాహారం బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది
- గ్రామ సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్ ఖాన్ పేట్ గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీ లో భాగంగా బాలింతలకు గుడ్లు ,బాలామృతం,పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ...బాలింతలు పౌష్టికాహారం బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు.బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాదగిరి జ్యోత్స్న శ్రీనివాస్,అంగన్‌వాడీ టీచర్ వెంకటక్క,బాలింతలు,తదితరులు పాల్గొన్నారు.

బిఎస్ఎఫ్ జవాన్ కు ఘన సన్మానం



- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

వరంగల్, తెలంగాణ చౌరస్తా:

దేశ సరిహద్దుల్లో బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ జవాన్ గా గత 25 సంవత్సరాలుగా విశేష సేవలందిస్తూ,దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన కాశిబుగ్గ నివాసి వంగరి రాజేష్ ని గురువారం ఘనంగా సన్మానించారు.దేశ భద్రత కోసం తన జీవితంలోని పాతికేళ్లను అంకితం చేసిన రాజేష్ అద్వితీయ దేశభక్తిని, సేవలను గుర్తిస్తూ బీజేపీ ఎండోమెంట్ ధార్మిక సెల్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.వరంగల్ నగరంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ జవాన్ వంగరి రాజేష్ ని శాలువా,మెమెంటోతో ఘనంగా సత్కరించారు .ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ...ప్రాణాలకు తెగించి దేశ సరిహద్దుల్లో పహారా కాస్తూ,మనందరికీ రక్షణ కల్పిస్తున్న సైనికులను గౌరవించడం ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని కొనియాడారు.రాజేష్ లాంటి జవాన్ల త్యాగాలు,నిరంతర సేవలు నేటి యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.దేశం కోసం సేవలందించి తిరిగొచ్చిన జవాన్‌ను గౌరవించుకోవడం తమ కమిటీకి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ధార్మిక జిల్లా కన్వీనర్ మడిపల్లి నాగరాజు గౌడ్,హనుమంతు శర్మ,డాక్టర్ కొంతం కృష్ణ,భారతీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ గౌడ్,బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రోగొల్ల భరత్ వీర్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన సూర సమ్మయ్య

- రావుల నారాయణ మృతి గ్రామానికి తీరని లోటు
- పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య

పాలకుర్తి, తెలంగాణ చౌరస్తా:



పాలకుర్తి గ్రామ మాజీ సర్పంచ్ రావుల నారాయణ మృతి పట్ల పెద్దపల్లి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం రావుల నారాయణ స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న సూర సమ్మయ్య, ఉమ్మడి కన్నాల మాజీ సర్పంచ్ సూర సునీతమ్మతో కలిసి ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు .ఈ సందర్భంగా సూర సమ్మయ్య మాట్లాడుతూ రావుల నారాయణతో తనకు ఎంతోకాలంగా అనుబంధం ఉందని గుర్తుచేశారు. గ్రామ అభివృద్ధి పట్ల ఆయనకున్న నిబద్ధత, ప్రజలతో ఉన్న ఆత్మీయ అనుబంధం, గ్రామానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ప్రజా జీవితంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు.



నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి

- ఎన్నికల హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి
- ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిరుద్యోగుల ఆవేదన సభ

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:

రాష్ట్రంలోని నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని నిరుద్యోగ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద నిరుద్యోగుల ఆవేదన సభ నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిరుద్యోగులను మోసం చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని, ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే ప్రకటించి అమలు చేయాలని కోరారు. జేఎల్, డీఎల్, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4, మెగా డీఎస్సీ, జీపీఓతో పాటు విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు సహా ఖాళీగా ఉన్న అన్ని రకాల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిరుద్యోగులకు నష్టం కలిగించే జీవోలను రద్దు చేయాలని స్పష్టం చేశారు.ప్రభుత్వం ఇప్పటికైనా నిరుద్యోగుల ఆవేదనను గుర్తించి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగ యువత తగిన గుణపాఠం చెబుతుందని, చిత్తుచిత్తుగా ఓడిస్తుందని హెచ్చరించారు.ఈ సభలో నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆర్.ఎల్. మూర్తి, నిరుద్యోగ జేఏసీ నాయకురాలు అస్మా, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్, ఏఐఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు ఉదయ్, డీబీఎస్ఏ రాష్ట్ర నాయకుడు కాసర్ల మధు, నరేష్, జక్కుల వెంకటేష్, మహేష్, అనిల్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలి

- బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాదయాత్ర
- ప్రజారోగ్యాన్ని కాపాడాలని డిమాండ్

ఎల్బీనగర్, తెలంగాణ చౌరస్తా:

ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ బీసీ పీపుల్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు.మన్సూరాబాద్ నుంచి డంపింగ్ యార్డ్ వరకు చేపట్టిన ఈ పాదయాత్రలో ఫెడరేషన్ నాయకులతో పాటు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీసీ పీపుల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొంగు వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న దుర్వాసన, విషపూరిత పొగతో పాటు గాలి, నీటి కాలుష్యం కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్యపై జీహెచ్ఎంసీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డ్ పరిసర ప్రాంతాల్లో గాలి, నీటి నాణ్యతను పరీక్షించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆటోనగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిస్థాయిలో తరలించాలని, అప్పటివరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బొంగు వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు.ఈ పాదయాత్రలో బీసీ, వివిధ ప్రజా సంఘాల నాయకులు జలమోని రవీందర్ ముదిరాజ్, కొంగరి కృష్ణ, కే. గాంధీ నాయక్, చిప్పలపల్లి యాదగిరి, నకిరేకంటి శ్రీకాంత్, ఖదిజ్జా సి వంశీ, గణేష్ గల్లా, మధు మాదిగ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లినో నేపథ్యంలో నీటి సమస్య నివారణ చర్యలు

- నీటినిల్వలవినియోగించుకోవడానికి 5 హెచ్ పి మోటర్లు అమర్చిన సర్పంచ్

రామన్నపేట తెలంగాణ చౌరస్తా :

రామన్నపేట పట్టణ కేంద్రంలో ఎల్లినో ప్రభావాన్ని గుర్తించి నీటి ఎద్దడిని నివారించడానికి శ్రీకారం చుట్టారు.స్థానిక పద్మశాలి కాలనీలో సంగిశెట్టి శేఖర్ ఇంటి దగ్గర మరియు జనంపల్లి రోడ్ ఎల్లమ్మ గుడి దగ్గర రెండు 5 హెచ్ పి మోటార్స్ అమర్చడం జరిగింది.ఈ సందర్భంగా సర్పంచ్ గరికే సత్యనారాయణ మాట్లాడుతూ నీటిని వృధా చేయకుండా వాడుకోవాలని రానున్న రోజుల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంటుందని తెలిపారు. నీటిని వినియోగించుకోవడాని మోటార్ బిగించినందుకు కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ గరిక సత్యనారాయణ, ఉప సర్పంచ్ మోటే రమేష్, సెక్రటరీ వంగాల సైదిరెడ్డి వార్డు మెంబెర్స్, జాడ సంతోష్, సూర్వి హరిబాబు, కొమ్ము శేఖర్, మోట్ మహేష్, బండ కవిత లింగస్వామి, అంజద్, నోముల అనిత యాదయ్య, నకిరేకంటి పార్వతమ్మ సుదర్శన్, గొరిగే పారిజాత శేఖర్, కొమ్ము రామస్వామి గాదె ఐలయ్య గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొనారు



ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.శ్రీనాథ్
- అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని,నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ,లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు.అదేవిధంగా కూనారం రోడ్డులోని ఏజీ మార్ట్ సూపర్ మార్కెట్‌లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి బియ్యం విక్రయ ధరలను పరిశీలించారు.ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ఇవేతెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలో చొప్పున నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ఈ విధంగా ఉన్నాయి.బీపీటీ / కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ / జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79 చొప్పున విక్రయించాలి.ఈ ధరలకు మించి బియ్యం విక్రయించరాదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి తెలిపారు.ప్రతి సూపర్ మార్కెట్,బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలుబియ్యం కృత్రిమ కొరత సృష్టించడం,ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కె. శ్రీనాథ్ హెచ్చరించారు.వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పరిశీలించాలని సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్,డీటీ పోచయ్య,పాల్గొన్నారు.



క్యూర్ చట్టం అమలుకు తొలి కార్యాచరణ సమావేశం

- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ బలోపేతంపై విస్తృత చర్చ

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

హైదరాబాద్ పరిధిలోని క్యూర్ ప్రాంత అభివృద్ధి, క్యూర్ చట్టం అమలును సమర్థవంతంగా చేపట్టే దిశగా తొలి కార్యనిర్వాహక కమిటీ సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సంస్థ కార్యాలయంలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సర్ఫరాజ్ అహ్మద్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా క్యూర్ చట్టం అమలు విధానం, క్యూర్ ప్రాంత పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల మధ్య సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల అమలు తదితర అంశాలపై అధికారులు విస్తృతంగా చర్చించారు. క్యూర్ ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సహకారంతో పనిచేయాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు.అలాగే వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో పాల్గొన్న వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ, క్యూర్ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.



వరద బాధితులకు బీఆర్ఎస్ నాయకుల అండ



- కేసప్పగూడెం కే.సీ.ఆర్ కాలనీలో 25 కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కేసప్పగూడెం గ్రామంలోని కే.సీ.ఆర్ కాలనీలో వరదల కారణంగా పలు ఇళ్లు నీట మునిగాయి. దీంతో గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు దెబ్బతిని సుమారు 25 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.ఈ నేపథ్యంలో గురువారం అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ నాయకులు వరద బాధిత కాలనీలో పర్యటించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాసాని చంద్రమోహన్-పద్మ, డా. భూక్యా ప్రసాద్-డా. ఉదయ జ్యోతిల ఆర్థిక సహకారం, ఆధ్వర్యంలో 25 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఆపద సమయంలో బాధితులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కేసప్పగూడెం సర్పంచ్ సోడెం భారతి, వార్డు సభ్యులు కొవ్వసి భారతి, సోయం వెంకటమ్మ, సున్నం పార్వతి, వేదాంతాపురం సర్పంచ్ సోడెం ముత్యాలరావు, మాజీ సర్పంచ్ సోమిని శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.అలాగే బీఆర్ఎస్ నాయకులు పిల్లెం బొత్తయ్య, సొందెం ముత్యాలరావు, సొందెం కృష్ణ, అశ్వారావుపేట టౌన్ ప్రెసిడెంట్ సత్యవరపు సంపూర్ణ, గూడవర్తి వెంకటేశ్వరరావు, జజ్జురపు శ్రీరామమూర్తి, తగరం జగన్నాథం, శెట్టిపల్లి రఘురామ్, జక్కం బలరామకృష్ణ, రాజనాల గంగాధర్, మోటూరి మోహన్ తదితరులు పాల్గొన్నారు.





మేపిల్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో లీగల్ అవేర్నెస్ కార్యక్రమం

- ముఖ్యఅతిథిగా హాజరైన హయత్ నగర్ సిఐ శంకరయ్య
- ట్రాఫిక్ సిఐ బి.రమేష్ ఎస్ఐ చిరంజీవి

ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

హయత్ నగర్ లోని మేపిల్ ఫోర్ట్ ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేకంగా లీగల్ అవేర్నెస్ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల చైర్మన్ సుబ్బా రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ శ్వేతా రెడ్డి,స్వాతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి హయత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.రమేష్, ఎస్ఐ చిరంజీవి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు నేటి సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాలు, వాటిని ఎలా ఎదుర్కోవాలి అనే అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ..నేటి ఆధునిక కాలంలో విద్యార్థులు తెలుసుకోవాల్సిన కీలక అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాలల రక్షణ, దైనందిన జీవితంలో పాటించాల్సిన చట్టాలు, గుడ్ సిటిజెన్‌షిప్, ట్రాఫిక్ నిబంధనలు అలాగే సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా ఎలా ఉపయోగించాలనే అంశాలపై సమగ్రంగా వివరించారు.విద్యార్థులు చిన్న వయసు నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగవచ్చని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. అలాగే అత్యవ సర పరిస్థితుల్లో 112 టోల్ ఫ్రీ నెంబర్,1930 సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలకు సంబంధించి సమాచారం అందించాలంటే 1908 నెంబర్లకు ఫోన్ చేసి వివరాలు వెల్లడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం తో పాటు ప్రిన్సిపల్ స్మిత,ఏవో అయేషా,ఉపాధ్యాయ బృందంతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో ఈకిడ్స్ స్పోర్ట్స్ మీట్



ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

హయత్ నగర్ నారాయణ పాఠశాలలో నిర్వహించిన ఈకిడ్స్ స్పోర్ట్స్ మీట్ క్రీడోత్సవాలు గురువారంతో ముగిసాయి.చిన్నారుల్లో దాగివున్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు.ఈ వేడుకకు జీఎం గోపాల్ రెడ్డి,ఏజీఎం రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ మానస, లావణ్య, ఆర్ఎండీ మీనా, ఈకిడ్స్ కోఆర్డినేటర్ ప్రియాంక,ఈఛాంప్స్ కోఆర్డినేటర్ దివ్య,వైస్ ప్రిన్సిపాల్స్ పి.స్వప్న, కవితలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.చిన్నారుల ఆటపాటలు, క్రీడా ప్రదర్శనలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవడం ద్వారా మానసిక,శారీరక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.పోటీల్లో చిన్నారులు చూపిన ప్రతిభను అభినందిస్తూ, వారిని స్వయంగా ఆటపాటల్లో ప్రోత్సహించారు.అతిథులు సైతం చిన్నారులతో కలిసి సరదాగా గడపడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఈ స్పోర్ట్స్ మీట్ అత్యంత విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

- కుటుంబంలో విషాద విషాదఛాయలు

కాల్వశ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సింగం సదానందం (48) గుండె పోటుతో మృతి చెందారు.గ్రామంలో టీవీ రిపేర్ చేస్తూ అందరికీ ఆప్యాయంగా పలకరించేవాడు, మంచి వ్యక్తిగా సదానందం పేరు తెచ్చుకున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరితో కలివిడిగా ఉంటూ గ్రామస్తుల అభిమానాన్ని పొందాడు. ఆయన అకస్మాత్తుగా మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు,గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సదానందం మృతి పట్ల గ్రామస్తులు,ప్రజాప్రతినిధులు, యువకులు సంతాపం వ్యక్తం చేశారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు.మృతునికి సాయి, రామ్ చరణ్ ఇద్దరు కుమారులు భార్య స్వరూప ఉన్నారు.





ఉచితంగా కూరగాయల విత్తనాల పంపిణీ

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు,రానున్న యాసంగి 2026-27 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోటు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు పంటల సాగులో తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ సూచించారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలని,సాగునీటి ప్రాజెక్టుల ద్వారా వ్యవసాయ అవసరాలకు నీటి సరఫరా ఉండకపోవచ్చని,కేవలం తాగునీటి అవసరాలకే నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోందని తెలిపారు.ఈ పరిస్థితుల్లో రైతులు భూములను బీడుగా ఉంచడం లేదా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను, ముఖ్యంగా తక్కువ నీటి అవసరం కలిగిన కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా నీటిని ఆదా చేసుకోవాలని సూచించారు.రైతులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ ద్వారా ఉచితంగా కూరగాయల విత్తన కిట్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో కిట్‌లో ఏడు రకాల కూరగాయల విత్తనాలు ఉంటాయని, ఈ విత్తనాలు 10 గుంటల విస్తీర్ణంలో సాగు చేసుకోవడానికి సరిపోతాయని,ఒక్కో కిట్ విలువ సుమారు రూ.1,000 ఉంటుందని పేర్కొన్నారు.ఆసక్తి కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,తమ వివరాలను సంబంధిత మండల ఉద్యానవన అధికారులు,ఉద్యానవన విస్తరణ అధికారులకు అందజేయాలని జిల్లా ఉద్యానవన అధికారి కోరారు.



తుఫాన్ నష్టాలపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు క్షేత్రస్థాయి పర్యటన

- రూ.3.5 కోట్లతో నిర్మించిన రింగుబండ ఒక్క తుఫాన్‌కే దెబ్బతినడంపై ఆగ్రహం
- బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించాలి
- దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలి

అశ్వారావుపేట, తెలంగాణ చౌరస్తా:

మురసు తుఫాన్ ప్రభావంతో అశ్వారావుపేట మండలంలో తీవ్రంగా నష్టపోయిన ప్రాంతాల్లో మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెచ్చా నాగేశ్వరరావు విస్తృతంగా పర్యటించారు.అచ్యుతాపురం,పాతనారంవారిగూడెం, నారాయణపురం తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న చెరువులు, రహదారులు, పంట పొలాలను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. పంట చేతికొచ్చే సమయంలో తుఫాన్ విరుచుకుపడటంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, బాధిత రైతులందరికీ ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అచ్యుతాపురం చిన్నయ్యకట్టు చెరువుకు గండి పడటంతో కొట్టుకు పోయిన రహదారిని, పాతనారంవారిగూడెం నుంచి గుర్రాల చెరువు, మొద్దులగూడెం వెళ్లే మార్గాల్లో దెబ్బతిన్నప్రాంతాలను ఆయన పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని అధికారులను కోరారు. దొంతికుంట చెరువుకు గండి పడటంతో నష్టపోయిన రైతులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రూ.3.5 కోట్ల నిర్మాణం ఒక్క తుఫాన్‌కే దెబ్బతినడంపై విమర్శలు

గుమ్మడివల్లి పెద్దవాగు ప్రాజెక్టు వద్ద రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన రింగుబండ ఒక్క తుఫాన్‌కే గండిపడటంపై మెచ్చా నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ప్రజాధనం వృథా అయిందని విమర్శించారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పర్యవేక్షణ లోపంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ నిర్మాణ పనులపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దెబ్బతిన్న రహదారులు, చెరువులకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, వరదలతో నష్టపోయిన రైతులు, ప్రజలను తక్షణమే ఆదుకోవాలని ఆయన కోరారు .ఈ పర్యటనలో మాజీ జిల్లా పరిషత్ ప్రాంతీయ ప్రచార ప్రతినిధి జూపల్లి రమణారావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు జల్లిపల్లి శ్రీరామమూర్తి, మోహన్ రెడ్డి, యు.ఎస్. ప్రకాశ్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.



ప్రభాత్ నగర్ పార్కును కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి
- టీమ్స్ ఆస్పత్రి గేటు ఏర్పాటుపై వాకర్ల ఆందోళన
- అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ

ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:

నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కొనసాగుతున్న మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం చైతన్యపురి డివిజన్ పరిధిలోని ప్రభాత్ నగర్ పార్కును స్థానిక శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా పార్కులో వాకింగ్ చేస్తున్న స్థానికులతో ఆయన నేరుగా మాట్లాడి,వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ క్రమంలో పార్కు పక్కనే నిర్మాణంలో ఉన్న టీమ్స్ హాస్పిటల్ యాజమాన్యం కొత్తగా గేటు ఏర్పాటు చేయాలని చూస్తుండటంపై వాకర్స్ ఎమ్మెల్యే వద్ద తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి వందలాది మంది స్థానికులు ఈ పార్కుపైనే ఆధారపడి ఉన్నారని, ఇక్కడ గేటు ఏర్పాటు చేస్తే వాకింగ్ చేసేందుకు స్థలం సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే అందుబాటులో ఉన్న పార్కును రెండు భాగాలుగా విభజించడం ఎంతమాత్రం సమంజసం కాదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.వాకర్ల ఆందోళనపై ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ..గతంలో ఆస్పత్రి శంకుస్థాపన సమయంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కలసి ఆస్పత్రి వద్ద పోలీస్ స్టేషన్, చిల్డ్రన్స్ పార్క్, వాటర్ ట్యాంక్, సబ్ స్టేషన్ల ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరగా వెంటనే జీవో జారీ చేశారని గుర్తుచేశారు.ప్రభుత్వం మారిన తర్వాత ఆ జీవోను పక్కనబెట్టారని ఎమ్మెల్యే మండిపడ్డారు.ప్రభాత్ నగర్ పార్కు స్థలాన్ని వాకర్లకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచేందుకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, తోట మహేష్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, త్రివేది, పవన్, జయశ్రీ, గట్టు శీను, రమణారెడ్డి, కాలనీ అధ్యక్షుడు బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధ



- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఈర్ల సమ్మయ్య

కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:

కాల్వశ్రీరాంపూర్ మండలంలోని గంగారం గ్రామ పరిధిలో గల ఊషన్నపల్లి ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమిక పాఠశాలలో గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని(పీటీఎం) ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పిల్లల అభ్యసన సామర్థ్యాలు,ప్రగతిపై సమీక్ష నిర్వహించారు.తల్లిదండ్రుల సమక్షంలో పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు.తమ పిల్లలకు వచ్చిన మార్కులను చెక్ చేసి,వాటిపై తల్లిదండ్రులు సంతకాలు చేశారు.పిల్లల ప్రగతిని పరిశీలించిన తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత,ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలంటే ప్రజాప్రతినిధులు,ప్రజలు,పిల్లల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమన్నారు. నిషితంగా పరిశీలించినట్లయితే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పిల్లలే అన్ని రంగాల్లో ముందంజలో ఉంటున్నారని,ఉద్యోగ,ఉపాధి రంగాల్లో వారిదే పైచేయిగా ఉందని అన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఉచిత నాణ్యమైన విద్యను పొందాలని ఆయన సూచించారు. తరువాత పాఠశాల విద్యార్థి గొడుగు రాహుల్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు రాహుల్ కుమారును నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దీవించి,ఆశీర్వదించారు.పిల్లలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య,ఉపాధ్యాయినులు శ్రీవాణి,స్రవంతి,సరిత,పిల్లలు వారి తల్లిదండ్రులు,గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



ఆర్టిజన్లకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం

తొర్రూరు-తెలంగాణ చౌరస్తా:

విద్యుత్ శాఖలోని ఆర్టిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవడం గర్వకారణమని ఐ ఎన్ టి యు సి-327 యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పసుపులేటి మధు అన్నారు.విద్యుత్ ఉద్యోగులతో సమానంగా ఆర్టిజన్లకు వేతనం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయాన్ని తీసుకోవడం ను హర్షిస్తూ ఐఎన్టి యుసి- 327 ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రం లోని విద్యుత్ శాఖ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్య మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ....

విద్యుత్ రంగంలో కేవలం రెగ్యులర్ ఉద్యోగుల సమస్యలే కాకుండా, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఆర్టిజన్లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన ప్రయోజనాలు కల్పించాలనే లక్ష్యంతో 327 యూనియన్ నిరంతరం యాజమాన్యంతో చర్చలు జరిపిందని,దాని ఫలితంగానే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.ఆర్టిజన్ సర్వీస్ రూల్స్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఆర్టిజన్లకు ఉద్యోగులతో సమానంగా అన్ని రకాల సెలవులు వర్తిస్తాయని, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ సదుపాయం కలిగిందన్నారు.మెడికల్ ఇన్వాలిడేషన్ పై రిటైర్ అయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం జరుగుతుందన్నారు.

ప్రతి 5 సంవత్సరాలకు ఒక అదనపు ఇంక్రిమెంట్ అందుతుందని తెలిపారు.

ఉద్యోగులతో సమానంగా లోన్లు, అడ్వాన్సులు అందుతాయని పేర్కొన్నారు.మెడికల్ స్కీమ్ పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంపు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ప్రెసిడెంట్ నర్సయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ పాషా,తొర్రూర్ డివిజన్ ప్రెసిడెంట్ కేశబోయిన బోజాలు,సడివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు ,ట్రెజరర్ రవికుమార్,జాయింట్ సెక్రెటరీ మచ్చ సతీష్‌లు పాల్గొన్నారు.







ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనేందుకు జల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

- భూగర్భ జలాల పరిరక్షణ, శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగంపై అవగాహన

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

ఎల్‌నినో ప్రభావాలతో భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను ఎదుర్కొనేందుకు జల వనరుల సంరక్షణ పై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి సారించింది. భూగర్భ జలాలను పరిరక్షించడంతో పాటు, శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించుకోవడంపై ప్రజల్లో, నిర్మాణ రంగ ప్రతినిధుల్లో అవగాహన కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది .ఈ క్రమంలో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అభివృద్ధిదారుల సమాఖ్య, తెలంగాణ జాతీయ స్థిరాస్తి అభివృద్ధిదారుల సంఘం, హైదరాబాద్ మహానగర నీటి సరఫరా, మురుగునీటి పారుదల మండలి సంయుక్త సహకారంతో నిర్వహించిన జల సంరక్షణ సదస్సులో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భూగర్భ జలాల పరిరక్షణ, ఎత్తైన భవనాలు, నిర్మాణ ప్రాజెక్టుల్లో ఏర్పాటు చేసిన మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేసిన నీటిని వివిధ అవసరాలకు వినియోగించడంపై చర్చించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి జల వనరులపై ఒత్తిడి పెరిగే అవకాశాలున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.ముఖ్యంగా భవనాల పరిసరాల పరిశుభ్రత, తోటల పెంపకం, నిర్మాణ పనులు, ఇతర తాగునీటితో సంబంధం లేని అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించాలని సూచించారు. దీనివల్ల మంచినీటి వినియోగం తగ్గడంతో పాటు భూగర్భ జలాలపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో నీటి కొరతను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మున్సిపల్ అధికారులు, నీటి సరఫరా సంస్థలు, నిర్మాణ రంగ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సదస్సులో అభిప్రాయపడ్డారు. జల వనరుల పరిరక్షణ, నీటి పొదుపు, శుద్ధి చేసిన నీటి పునర్వినియోగం ద్వారా సుస్థిర పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పిలుపునిచ్చింది.

రూ.3.10 కోట్లతో వరద ముంపునకు శాశ్వత పరిష్కారం



- తారానగర్ నుంచి లింగంపల్లి వరకు నూతన వర్షపు నీటి కాలువ నిర్మాణం
- పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

శేరిలింగంపల్లి డివిజన్‌లో ఏళ్లుగా స్థానికులు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా రూ.3.10 కోట్ల అంచనా వ్యయంతో నూతన వర్షపు నీటి కాలువ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. తారానగర్ ముస్లిం శ్మశానవాటిక నుంచి లింగంపల్లి గ్రామంలోని సెవెన్ హిల్స్ భవనం వరకు ఈ కాలువ నిర్మాణ పనులు చేపట్టనున్నారు.ఈ నేపథ్యంలో గురువారం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ఆనంద్, సహాయ ఇంజినీర్ భాస్కర్‌తో కలిసి ప్రతిపాదిత కాలువ నిర్మాణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల నిర్మాణ ప్రణాళిక, నాణ్యతా ప్రమాణాలు, పనుల పురోగతిపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.కాలువ నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో తారానగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న వరద ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని కార్పొరేటర్ పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం లింగంపల్లి గ్రామం, వెంకట్‌రెడ్డి కాలనీలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని,ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు వీరేశం గౌడ్, జయంత్ కుమార్, గడ్డం రవి యాదవ్, జ్ఞానేశ్వర్, శ్రీనివాస్, అజీమ్, కృష్ణ, సురేష్ రాథోడ్, అందెల కిరణ్, రఘు యాదవ్, భరత్ గౌడ్, రేవంత్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరుల వర్ధంతి సభకు తరలిరావాలి

- నవంబర్ 9న పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో జరిగే సభను విజయవంతం చేయాలి

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటాల్లో ప్రాణాలర్పించిన విప్లవ యోధుల సంస్మరణార్థం ఈ నెల 9న ఉదయం 11 గంటలకు పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న అమరవీరుల వర్ధంతి సభను ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె. విశ్వనాథ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కేంద్రంలో అమరవీరుల వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా అధ్యక్షుడు ఎల్. భీమన్న మాట్లాడుతూ.. తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం, గోదావరి లోయ, దండకారణ్య పోరాటాల్లో వేలాది మంది విప్లవకారులు తమ విలువైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని పేర్కొన్నారు. నవంబర్ నెలలోనే విప్లవ కమ్యూనిస్టు యోధులు కామ్రేడ్స్ చంద్ర పుల్లారెడ్డి, పోట్ల రామనరసయ్య, నీలం రామచంద్రయ్య, జేసీయస్ ప్రసాద్, కొండపల్లి సీతారామయ్య, నంబాల కేశవరావు, అక్కిరాజు హరగోపాల్, మల్లోజుల కోటేశ్వరరావు తదితరులు అమరులయ్యారని గుర్తు చేశారు. అలాగే చారు మజుందార్, దేవులపల్లి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ సింగ్, తరిమెల నాగిరెడ్డి, కొల్లా వెంకయ్య, మాదాల నారాయణస్వామి, పైలా వాసుదేవరావు వంటి విప్లవోద్యమ నాయకులు కూడా అమరులయ్యారని తెలిపారు. నవంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు అమరవీరుల వర్ధంతి సభలు నిర్వహించాలని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు కె. విశ్వనాథ్ వెల్లడించారు. నవంబర్ 9న పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఉదయం 11 గంటలకు జరిగే అమరవీరుల వర్ధంతి సభకు ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, రాములు, సత్తయ్య, వెంకటయ్య, రాజు, లక్ష్మీనారాయణ, సంతోష్, పోషన్న తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలే..!



- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి
- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్
- పెద్దపల్లిలోని పలు షాపులలో పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు
- అధిక ధరలకు బియ్యం విక్రయించిన శ్రీ సాయి సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు
- ప్రతి షాపులో ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలను ప్రదర్శించాలి

పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :

ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కూనారం రోడ్డులోని ఏజీ మార్ట్ సూపర్ మార్కెట్‌లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి బియ్యం విక్రయ ధరలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం.. బీపీటీ, కేవీఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్, తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ.79 చొప్పున విక్రయించాలని తెలిపారు. ఈ ధరలకు మించి బియ్యం విక్రయించరాదని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూచించారు
ప్రతి సూపర్ మార్కెట్, బియ్యం విక్రయ కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పరిశీలించాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్, డీటీ పోచయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో లైట్‌హౌస్ కీలక పాత్ర



- చందానగర్‌లో ఘనంగా లైట్‌హౌస్ నైపుణ్య శిక్షణ కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలు

శేరిలింగంపల్లి, తెలంగాణ చౌరస్తా:

యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పించడంలో చందానగర్ లైట్‌హౌస్ నైపుణ్య అభివృద్ధి కేంద్రం కీలక పాత్ర పోషిస్తోందని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉప కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహిస్తున్న చందానగర్ లైట్‌హౌస్ కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి శ్రీనివాస్ మాట్లాడుతూ..లైట్‌హౌస్ కేంద్రం అందిస్తున్న వివిధ నైపుణ్య శిక్షణా కోర్సులు యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు నైపుణ్య శిక్షణతో పాటు ఉద్యోగ అనుసంధానం ద్వారా 1,500 మందికి పైగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.గత నాలుగేళ్లుగా యువత భవిష్యత్తుకు బాటలు వేస్తూ, వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్న లైట్‌హౌస్ బృందాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మున్సిపల్ కమిషనర్, సమాజ సమన్వయకర్తలు, లైట్‌హౌస్ జాతీయ విస్తరణ విభాగం అధిపతి అతుల్, తెలంగాణ విస్తరణ విభాగం అధిపతి ఆకుల శ్రీనివాస్, చందానగర్ లైట్‌హౌస్ కేంద్రం బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాన్ బెయిలబుల్ వారెంట్‌పై నిందితుడి అరెస్ట్

- కోర్టులో హాజరుపరిచిన మేడిపల్లి పోలీసులు

మేడిపల్లి, తెలంగాణ చౌరస్తా:



పలు నేరాల్లో నిందితుడిగా ఉండి, నాన్ బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని మేడిపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. మేడిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. బోడుప్పల్‌లోని ద్వారకానగర్‌కు చెందిన కాదమంచి శివ (28)పై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. దీంతో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఎస్సెస్టీ షీట్ తెరిచారు. ఈ క్రమంలో అతడిపై న్యాయస్థానం నుంచి నాన్ బెయిలబుల్ వారెంట్ పెండింగ్‌లో ఉంది. అయినప్పటికీ పోలీసులకు చిక్కకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు.ఈ నేపథ్యంలో పక్కా సమాచారం అందుకున్న మేడిపల్లి పోలీసుల బృందం గురువారం అతడిని అదుపులోకి తీసుకుంది. అనంతరం న్యాయస్థానం ముందు హాజరుపరిచినట్లు మేడిపల్లి సీఐ జలంధర్ రెడ్డి వెల్లడించారు.



రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

- వెయ్యి టీఎంసీల నీటిని సముద్రం పాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే
- క్రాప్ హాలిడే ప్రకటిస్తే ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

కమలాపూర్, తెలంగాణ చౌరస్తా:

రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి సుమారు వెయ్యి టీఎంసీల నీటిని వినియోగించుకోకుండా సముద్రం పాలయ్యేలా చేశారని ఆరోపించారు. కమలాపూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఈ సందర్భంగా కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తరుగు పేరుతో కోతలు విధించకుండా, నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద నీరు అందుబాటులో ఉన్నప్పటికీ కాళేశ్వరం నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కష్టాలు మొదలయ్యాయని విమర్శించారు. క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ హామీ ఏమైందని నిలదీశారు. నీటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ క్రాప్ హాలిడే ప్రకటించడం రైతాంగానికి తీరని అన్యాయమని అన్నారు.ప్రభుత్వం వెంటనే క్రాప్ హాలిడే నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని హుజూరాబాద్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ క్రాప్ హాలిడే ప్రకటిస్తే పంటలు సాగు చేయలేక నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, మార్కెట్ చైర్మన్ ఝాన్సీ రవీందర్, ఇతర ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలి

- ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలి
- పిడిఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్,
- పిడిఎస్‌యూ డివిజన్ అధ్యక్షుడు గడ్డం గౌతమ్

హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:



ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్ చేశారు.పిడిఎస్‌యూ విప్లవ విద్యార్థి అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యానగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మూసారాంబాగ్‌లోని బీసీ హాస్టల్‌లో కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ 51వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు గడ్డం గౌతమ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. విప్లవ విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో గత 54 ఏళ్లుగా దేశంలో నెలకొన్న అసమానతలకు వ్యతిరేకంగా పిడిఎస్‌యూ పోరాటం కొనసాగిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం ఎస్ఐఆర్ పేరుతో తమకు వ్యతిరేకంగా ఉన్న ఓటర్ల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ ప్రక్రియకు ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సహకరిస్తున్నారని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమని పేర్కొంటూ, ఆయనను తక్షణమే విధుల నుంచి తొలగించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దేశంలో నెలకొన్న అన్ని రకాల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పిడిఎస్‌యూ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థులంతా పిడిఎస్‌యూలో భాగస్వాములై తమ హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆసిఫ్, జిల్లా నాయకులు మనోజ్, నవదీప్, నరేష్, డివిజన్ నాయకులు అరవింద్, శివ, వెంకటేష్, కుమార్, రాజేష్, సోమశేఖర్, మాధవ్, హరీష్, మహేష్, సన్నీ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటాం

- వారం రోజుల్లో ఉద్యమకారుల గుర్తింపు వెబ్‌సైట్ ప్రారంభం
- తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు

తెలంగాణ చౌరస్తా, నూతనకల్:

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు హామీ ఇచ్చారు. గురువారం జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొన్నే గ్రామంలోని లక్ష్మణ్ గౌడ్ నివాసానికి వెళ్లిన కమిటీ సభ్యులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.మలిదశ తెలంగాణ ఉద్యమకారుల విజ్ఞప్తి మేరకు ప్రొఫెసర్ కోదండరాం, శోభన్ రెడ్డి, రాములు నాయక్‌లు లక్ష్మణ్ గౌడ్ కుటుంబాన్ని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని ఉద్యమకారుల సమక్షంలో భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమకారులు, ఉద్యమ సమయంలో జైలుకు వెళ్లిన పలువురు నాయకులు మాజీ టీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల సోమన్న నేతృత్వంలో ఉద్యమకారుల మిత్రబృందంగా పాల్గొన్నారు.అనంతరం కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు, త్యాగాలను గుర్తించి వారికి సముచిత న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.తెలంగాణ సాధన కోసం ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, జైళ్లకు వెళ్లి పోరాటం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తగిన గుర్తింపు కల్పించాలని, వారి కుటుంబాలకు అండగా నిలిచి న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఉద్యమకారులు ప్రభుత్వాన్ని కోరారు.